RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 267 పేజీలు - 08 బుధవారం 20 ఆగస్టు 2025

## ఇందిరమ్మ ఇళ్ల అవతవకలపై విచారణకు ఆదేశం



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 19:** హుజుర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని జానపహాడ్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జరిగిన అవకతవకలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు. అవకతవకల విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే సదరు కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ కేసు నమోదు చేయాలంటూ జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తక్షణమే రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ సదరు కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేయడంతో పాటు– ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఒకటి, రెండు రోజుల్లో వెంకటయ్య అరెస్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## మిగ్-21 విమానాలకు వీడ్కోలు...
## ఛండీగఢ్ లో చివరి ల్యాండింగ్!

భారత వాయుసేనలో ఒక శకం ముగింపు..

చివరిసారిగా గాల్లోకి మిగ్-21

సెప్టెంబర్ 19న చండీగఢ్‌లో చివరి ల్యాండింగ్

1971 యుద్ధంలో కీలక పాత్ర పోషించిన యుద్ధ విమానం

ప్రమాదాల కారణంగా 'ఫ్లయింగ్ కాఫిన్' అనే అపవాదు

తేజస్ విమానాల ఆలస్యంతోనే సేవల కొనసాగింపు




2లో.

## ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచడమే లక్ష్యం

ప్రధాని మోదీతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కీలక సమావేశం

సరిహద్దు సమస్య పరిష్కారంపై 24వ విడత ప్రత్యేక ప్రతినిధుల చర్చలు

భారత్ లేవనెత్తిన మూడు కీలక అంశాలపై చర్యలు తీసుకుంటామని చైనా హామీ



2లో.

# విద్యా ఉద్యోగాల్లోనే రిజర్వేషన్లు

రాజకీయ రిజర్వేషన్ల అవసరం లేదు

ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించడం లేదు

కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ప్రత్యామ్నాయం

వికారాబాద్ పర్యటనలో బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు



**తొలి అక్షరం/వికారాబాద్,ఆగస్టు19:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను సైతం మోసం చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాబోయే ఏ ఎన్నికలు అయినా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత మొదటిసారి వికారాబాద్ జిల్లాకు రాంచందర్ రావు వచ్చారు.జిల్లా పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాంచందర్ రావుకు ఘనస్వాగతం పలికారు. ఆయనను బీజేపీ శ్రేణులు గజమాలతో సన్మానించారు. తేజ ఫంక్షన్ హాల్లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని రాంచందర్ రావు ప్రసంగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని రాంచందర్ రావు ధ్వజమెత్తారు. విద్య, ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని.. రాజకీయాల్లో అవసరం లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకి లేదని... నిజంగా చిత్తశుద్ధి ఉంటే, బీసీల జాబితాలో ముస్లింలను ఎందుకు చేరుస్తున్నారని అన్నారు. బీసీలకు ఇప్పటికే బీసీ-బీ, బీసీ-ఈ, ఈబీసీ కింద రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని... రిజర్వేషన్లు విద్య, ఉద్యోగాల్లో మాత్రమే ఉండాలని... రాజకీయాల్లో మాత్రం ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. మిగతా2లో...

## ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా
# జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి



2లో

విపక్షాల కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు తేజం!

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ రెడ్డి

ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా

ఏకగ్రీవం చేయాలన్న అధికార పక్షం ఆశలకు గండి



కాళేశ్వరం కమిషన్ నివేదిక...

## హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

2లో.

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్లు

పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదన్న కేసీఆర్

## తెలంగాణ రైతులకు అన్యాయం చేయొద్దు


యూరియా కోటా విడుదల చేయండి

కేంద్రానికి సిఎం రేవంత్ రెడ్డి వినతి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 19:** తెలంగాణ రైతాంగానికి అవసరం మేరకు యూరియాను తక్షణం సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణపై వివక్ష చూపించొద్దని అన్నారు. కేటాయించిన వాటా మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా చేయకపోవడంతో తలెత్తుతున్న సమస్యలను తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులకు వివరించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రానికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు రైతాంగానికి తలెత్తాయని పేర్కొన్నారు. మిగతాది 2లో...



## వాటి ధరలు తగ్గించండి.. అప్పుడు అన్ని ధరలు తగ్గుతాయి: కెటిఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 19:**గత పుష్కరకాలంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను పెంచి లక్షల కోట్ల రూపాయలను కేంద్రం ప్రజల నుంచి దోచుకుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. జిఎస్టీ స్లాబ్ రద్దు లేదా మార్పు అని.. వీటి ద్వారానే ప్రజల జీవితాల్లో నిజమైన దీపావళి వస్తుందంటూ కేంద్ర సర్కార్ ప్రచారం చేస్తుందని విమర్శించారు. బుధవారం జిఎస్టీ కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో కేంద్రానికి కెటిఆర్ బహిరంగ లేఖ రాశారు. ఒకవైపు ప్రతినెల వేలాది రూపాయలు పెట్రోల్, ఎల్పిజి, డీజిల్ రూపంలో భారం మోపుతూ.. జీఎస్టీ స్లాబ్ మార్పు వలన కేవలం పదుల రూపాయల భారం తగ్గిస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు."ధరల తగ్గింపుపైన చిత్తశుద్ధి ఉంటే.. దానికి ప్రాథమిక కారణమైన పెట్రోల్ ధరలను తగ్గించాలి. పెట్రోల్, డీజిల్ తగ్గితే రవాణా భారం తగ్గి.. దాదాపు అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయి. పెట్రోల్, డీజిల్, ఎల్పిజిపైన పన్నులు తగ్గించి.. సెస్సులను మిగతా2లో...

# బెట్టింగ్ యాప్‌లకు అడ్డుకట్ట

- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు కేబినేట్ ఆమోదం
- నేడు పార్లమెంట్‌ముందుకు బిల్లు వచ్చే అవకాశం
- కోటా-బురిడీలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం
- కటక్-భువనేశ్వర్ 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి ఓకే
- కేంద్ర కేబినేట్ పలు కీలక నిర్ణయాలు




2లో.

## ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా

# జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ఉపరాష్ట్రపతి ఎన్నికల బరిలో విపక్షాల ఇండియా కూటమి తమ అభ్యర్థిని ఖరారు చేసింది. ఎవరూ ఊహించని విధంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, తెలంగాణకు చెందిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పేరును ఈరోజు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక ఏకగ్రీవం కావాలన్న అధికార పక్షం ప్రయత్నాలకు ప్రతిపక్షాలు గండికొట్టినట్టయింది.జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయవ్యవస్థలో విశేషమైన అనుభవం ఉంది. ఆయన 2007 నుంచి 2011 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారు. ఆ తర్వాత గోవా లోకాయుక్తగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం గ్రామం. న్యాయ వ్యవస్థలో ఉన్నత స్థాయిలో పనిచేసిన తెలుగు వ్యక్తిని ప్రతిపక్షాలు తమ అభ్యర్థిగా ఎంపిక చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇప్పటికే అధికార ఎన్డీయే కూటమి తమ అభ్యర్థిగా దక్షిణాదికి చెందిన సీపీ రాధాకృష్ణన్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి బదులుగా ఇండియా కూటమి సైతం దక్షిణాది నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని నిర్ణయించుకుంది. అనూహ్యంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును తెరపైకి తెచ్చింది. దీంతో ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికల పోరు ఇద్దరు దక్షిణాది నేతల మధ్య ఆసక్తికరంగా మారింది. ఈ ఎంపిక ద్వారా ప్రతిపక్షాలు కేవలం పోటీ ఇవ్వడమే కాకుండా, న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖుడిని బరిలోకి దించి వ్యూహాత్మకంగా వ్యవహరించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కాళేశ్వరం కమిషన్ నివేదిక...

## హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 19:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్లు హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదని, ఆ కమిషన్ సమర్పించిన నివేదికను కొట్టివేయాలని వారు కోరారు.జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు కేసీఆర్, హరీశ్ రావు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించరు. ప్రభుత్వానికి ఏది కావాలో కమిషన్ నివేదిక ఆ విధంగా ఉందని వారు పేర్కొన్నారు.కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## తెలంగాణ రైతులకు అన్యాయం చేయొద్దు

(మొదటి పేజి తరువాయి)

ఈ విషయంలో పార్లమెంట్ సభ్యులు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. యూరియా సరఫరా విషయంలో సీఎం రేవంత్ స్వయంగా కేంద్ర మంత్రికి వివరించడమే కాకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు దఫాలుగా లేఖలు రాసిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ రాష్ట్ర అవసరాల మేరకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రం వివక్ష చూపుతోందని అన్నారు. రైతుల సమస్యలపై పార్లమెంట్ వేదికగా ఎంపీలు ఆందోళన సాగిస్తున్నప్పటికీ కోటా మేరకు యూరియా విడుదల చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆక్షేపించారు. అవసరమైన మేరకు తక్షణం యూరియా సరఫరా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

## మిగ్-21 విమానాలకు వీడ్కోలు...

## ఛండీగఢ్‌లో చివరి ల్యాండింగ్!

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఆగస్టు 19:** భారత వాయుసేన చరిత్రలో చెరగని ముద్ర వేసిన మిగ్–21 యుద్ధ విమానాల ప్రస్థానం ముగింపు దశకు చేరుకుంది. ఆరు దశాబ్దాల పాటు దేశానికి సేవలందించిన ఈ తొలి సూపర్ సోనిక్ ఫైటర్ జెట్, సెప్టెంబర్ 19న చండీగఢ్ ఎయిర్‌బేస్‌లో తన చివరి ల్యాండింగ్ చేయనుంది. 1963లో వాయుసేనలో చేరిన ఈ విమానం, తన వేగం, చురుకుదనంతో ఒకప్పుడు ఆకాశంలో రారాజుగా వెలిగింది.యుద్ధ క్షేత్రంలో అసమాన ధీరుడు1971 భారత్–పాక్ యుద్ధంలో మిగ్–21 విమానాలు కీలక పాత్ర పోషించాయి. ఆ యుద్ధంలో పాల్గొన్న ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) పృథ్వీ సింగ్ బ్రార్ తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. పాకిస్థాన్‌లోని ఎయిర్‌బేస్‌పై రెండు 500 కేజీల బాంబులు జారవిడిచి, శత్రువులకు చెందిన నాలుగు ఎఫ్–86 సాబ్రే జెట్‌ల నుంచి చాకచక్యంగా తప్పించుకున్నానని ఆయన తెలిపారు. "మృత్యువుకు క్షణాల దూరంలో ఉన్నాననిపించింది. కానీ మిగ్–21 వేగం, నా శిక్షణ నన్ను కాపాడాయి" అని బ్రార్ వివరించారు. 2019లో వింగ్ కమాండర్ అభినందన్ వర్థమాన్ నడిపిన మిగ్–21 బైసన్, పాకిస్థాన్‌కు చెందిన ఆధునిక ఎఫ్–16 విమానాన్ని కూల్చివేసిందని భారత్ ప్రకటించగా, పాకిస్థాన్ ఈ వాదనను ఖండించింది.

## వాటి ధరలు తగ్గించండి.. అప్పుడు అన్ని ధరలు తగ్గుతాయి: కెటిఆర్

(మొదటి పేజి తరువాయి)

పూర్తిగా ఎత్తివేసి మీ చిత్తశుద్ధి నిరూపించుకోండి. చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి. అన్ని జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి. విద్యకు సంబంధిత ఫీజులపై విధించే జీఎస్టీని పూర్తిగా తొలగించాలి. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన మందులు, ప్రాణాలు కాపాడే జీవనావశ్యక ఔషధాలపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి" అని కెటిఆర్ లేఖలో పేర్కొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీర

● జలదిగ్బంధంలోనే ఏడుపాయల

**తొలి అక్షరం/మెదక్,ఆగస్టు19:** సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో మంజీరా ఉగ్రరూపం దాల్చింది. వన దుర్గ ఆనకట్టకు 69,000 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో ఏడుపాయల పుణ్యక్షేత్రం ఆరు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. గర్భగుడినీ మంజీరా ముంచెత్తింది. రాజగోపురంలో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు– చేసి అమ్మవారి దర్శనాన్ని కల్పిస్తున్నారు. మంజీరా పరివాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇన్‌ఎ÷–లో 39,009 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఎలో 43,466 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థం 29.917 టీ–ఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.534 టీఎంసీలుగా నమోదైంది.

# ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరచడమే లక్ష్యం

### ప్రధాని మోదీతో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కీలక సమావేశం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఆగస్టు 19:**

భారత్, చైనా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల సడలింపు దిశగా కీలక ముందడుగు పడింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మంగళవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, వివాదాస్పద అంశాలను సామరస్యంగా పరిష్కరించుకోవడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన వాంగ్ యీ, తన పర్యటనలో భాగంగా ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్–చైనా సరిహద్దు సమస్యపై 24వ విడత ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చలు కూడా జరిగాయి. ఈ చర్చల్లో సరిహద్దు వాణిజ్యం, నదీ జలాల సమాచార మార్పిడి, కనెక్టివిటీ, వాణిజ్య సంబంధాలు, యాత్రికులకు సౌకర్యాలు వంటి పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.అంతకుముందు వాంగ్ యీ, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కూడా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో రేర్ ఎర్త్స్, ఎరువులు, టన్నెల్–బోరింగ్ యంత్రాలకు సంబంధించి భారత్ వ్యక్తం చేసిన మూడు ప్రధాన ఆందోళనలపై సానుకూలంగా స్పందిస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని వాంగ్ యీ హామీ ఇచ్చినట్లు సమాచారం.

జైశంకర్ మాట్లాడుతూ, "రెండు దేశాల మధ్య అభిప్రాయ భేదాలు వివాదాలుగా మారకూడదు, అలాగే పోటీతత్వం సంఘర్షణకు దారితీయకూడదు," అని స్పష్టం చేశారు. ఈ పర్యటన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడానికి ఒక మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు.ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు చైనాలోని తియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశం జరగనున్న నేపథ్యంలో వాంగ్ యీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

# బెట్టింగ్ యాప్‌లకు అడ్డుకట్ట

### ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు కేబినేట్ ఆమోదం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ఆన్‌లైన్ బెట్టింగ్‌ను అరికట్టే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకురాబోతోంది. దీనికి ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేసినట్లు– సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ప్రధాని మోడీ అధ్యక్షతన మంగళవారం డిల్లీలో కేంద్ర కేబినెట్ భేటీ– అయ్యింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. భేటీ– అనంతరం కేబినెట్ నిర్ణయాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఆన్ లైన్ బెట్టింగ్‌ను ఇకపై తీవ్ర నేరంగా పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయి ంచింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వేదికగా బెట్టింగ్‌కు పాల్ప డితే శిక్ష తప్పదని, భారీ జరిమానాలు విధించే విధంగా ఆన్ లైన్ గేమింగ్ బిల్లును రూపొందించినట్లు– కేంద్రం తెలిపింది. ఇకపై ఆన్ లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై కేంద్ర మే నేరుగా నిఘా పెట్టనుంది. ఆన్ లైన్ బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్స్ ఆగడాలకు మన దేశంలో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. చేపకు గాలం వేసినట్టు– కొత్త కస్టమర్లకు మొదట్లో రూ. వందకు రూ. రెండొందలు.. రూ. వెయ్యికి రెండు వేలు, మూడు వేలు ఇస్తూ మెల్లిగా ఊబిలోకి లాగుతున్నారు. ఈజీ మనీ కోసం అత్యాశతో కొందరు, వ్యసనాల బారిన పడి ఇంకొందరు.. పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటలు మునిగి తేలుతున్నారు. గతంలో ఈ వ్యసనం కొంతమంది యువత వరకే పరిమిత మవగా..ఇప్పుడది ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, బ్యాంకర్లు..అనే తేడా లేకుండా ప్రతి రంగానికి చేరింది. ప్రతి వంద మందిలో దాదాపు 95 శాతం మంది చేతులు కాల్చుకుని, ఆర్థికంగా చితికిపోతు న్నారు. డబ్బుల కోసం కొందరు అడ్డదారి తొక్కుతుం డగా..అవమానంగా భావించేవారు తమ ప్రాణాలతోపాటు కుటుంబ సభ్యుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకపై ఈ ఆన్ లైన్ బెట్టింగ్ ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఆన్ లైన్ గేమింగ్ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఏదైనా పెద్ద ఘటన.. లేదంటే కుటుంబ సభ్యులు వీటి బారినపడి బలైన చోట మాత్రమే ఫిర్యాదు ఆధారంగా పోలీసులు స్పందిస్తున్నారు. లేదంటే ఇది తమ పనికాదన్నట్టు– లైట్ తీసుకుంటు–న్నారనే విమర్శలున్నాయి. పలువురు సినీ, క్రీడా ప్రముఖులు ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ యాప్స్‌పై నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్ యాప్స్‌పై చర్యలకు కేంద్రం సిద్ధమైనట్లు– తెలుస్తోంది. ఇకపోతే రాజస్థాన్‌లోని కోటా– బుందిలో రూ.1507 కోట్లతో కొత్త విమానాశ్రయ నిర్మాణానికి కేబినేట్ ఆమోదం తెలిపింది. రూ.8307.74 కోట్లతో హైబ్రిడ్ యాన్యుటీ– మోడ్‌లో భువనేశ్వర్ బైపాస్ నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.రాజస్థాన్‌లోని కోటా–బురిడీలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోటా ఎయిర్‌పోర్ట్‌కు 440.06 హెక్టార్ల భూమి, రూ.1507 కోట్ల మంజూరుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అలాగే.. ఒడిశాలో కటక్–భువనేశ్వర్ 6 లేన్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. రూ.8307 కోట్ల వ్యయంతో భువనేశ్వర్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టానున్నారు. కోట–బుంది గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని రూ.1507.00 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయడానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ– ఆఫ్ ఇండియా చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించిం దని తెలిపారు.

# విద్యా ఉద్యోగాల్లోనే రిజర్వేషన్లు

(మొదటి పేజి తరువాయి)

ప్రత్యామ్నాయంగా తెలంగాణలోని ప్రజలు నమ్మకంతో బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు రాంచందర్ రావు. రైతు బంధు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షలాది మంది రైతులకు ఏ ఒక్కసారి ఆపకుండా పీఎం కిసాన్ యోజన నిధులు జమ చేస్తున్నారని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ డబ్బులు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు నేడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ పాలన వైపు చూస్తున్నారని వెల్లడించారు. కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని రాంచందర్ రావు దిశానిర్దేశర చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రం యూరియా ఇవ్వడం లేదు అని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని.. రైతుల ఇబ్బందులకు నిజమైన కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు.మార్క్‌ఫెడ్ ద్వారా యూరియా సరఫరా సరిగ్గా జరగడం లేదని... ఎరువుల దుకాణాల్లో యూరియా దొరక్కపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం సిగ్గుచేటని అన్నారు రామచందర్ రావు.రాబోయే రోజుల్లో ఏ శక్తి అడ్డొచ్చినా, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వికారాబాద్ జిల్లా పేరును అనంతగిరి జిల్లాగా మారుస్తామని.. అనంతగిరి పర్యాటక కేంద్రంగా దక్షిణ ఊటీగా ప్రసిద్ధి చెందిందని, అనంత పద్మనాభస్వామి ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో వికారాబాద్‌లో బీజేపీ మూడు అసెంబ్లీ స్థానాలు గెలుస్తుందని అన్నారు రామచందర్ రావు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపీని గెలిపించేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రజలు ఇప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీని చూస్తున్నారని.. గత బీఆర్ఎస్,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ ఒకే తీరుగా పాలనలో వైఫల్యం చెందాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ దళితబంధు, రైతుబంధు అంటూ మాయమాటలు చెప్పి, సరిగ్గా అమలు చేయక మోసం చేసిందని... అందుకే ప్రజలు వారిని ఇంటికి పంపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా కింద ప్రతి రైతుకి 15 వేలు ఆర్థిక సాయం ఇస్తామని హామీ ఇచ్చింది కానీ.. వాస్తవానికి రెండు విడతల్లో కేవలం రూ.6 వేలు మాత్రమే ఇచ్చారని.. ఇది రైతులను మోసం చేయడమేనని అన్నారు. వికారాబాద్‌లో రాబోయే మున్సిపాలిటీ– ఎన్నికల్లో కూడా బీజేపీ గెలుపు ఖాయమని.. విద్యావంతులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాన్ని గుర్తించారని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం ఇప్పటికే 12 లక్షల కోట్లను కేటాయించిందని.. తెలంగాణ అభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ సర్కారు అవసరమని అన్నారు.ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రజల ఇళ్లకు వెళ్లి కేంద్రం చేస్తున్న అభివృద్ధి పనులు వివరించాలని అన్నారు.

# భవిష్యత్ అంతా హార్టికల్చర్‌దే

### శ్రమిస్తే ఐటి రంగంకన్నా మిన్నగా ఉద్యోగాలు

### వ్యవసాయశాఖమంత్రి పొంగులేటి

**తొలి అక్షరం/హైదరాబాద్, ఆగస్టు 19:** కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీలో అక్షయ డైనింగ్ హాలును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. భారతదేశంలోనే అన్ని సౌకర్యాలతో హార్టికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు– చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. మిగతా అన్ని రంగాల కంటే వ్యవసాయరంగానికే అత్యంత ప్రాధాన్యం ఉంది. భవిష్యత్తు అంతా వ్యవసాయానిదే. గత 4 సంవత్సరాల క్రితం కరోనా సమయంలో అన్ని వ్యవస్థలు మూతపడినా, నాగలి ఆగలేదు. రైతు శ్రమ ఆగలేదు. ఇంకా ఎక్కువ మొత్తంలో దిగుబడులు సాధించడం జరిగింది. హార్టికల్చర్ విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉటుందని, విద్యార్థులుగా ప్రావీణ్యతను పెంచుకుంటే, సాఫ్ట్ వేర్ ఉద్యోగుల కన్నా, మీకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు మొత్తం కోర్సులో సగానికి కన్నా ఎక్కువ రోజులు పోలాల్లో ఉండి, వ్యవసాయంలో ప్రావీణ్యం సంపాదించుకోవాలని, రైతు చేసే వ్యవసాయ విధానాలను పరిశీలించాలని తెలిపారు. హార్టికల్చర్ పంటలను అభివృద్ధి చేస్తే, అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, దేశంలో లక్ష కోట్లతో పామాయిల్ దిగుమతి చేసుకోవడం జరుగుతుందని, పామాయిల్ దిగుమతి తగ్గించాలంటే, ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న 13 లక్షల ఎకరాలలో ఉన్న పామాయిల్ పంటను 70 లక్షల ఎకరాలకి విస్తరించినట్లయితే, డిమాండ్ ను అధిగమించడానికి అవకాశం ఉంటు–ందన్నారు.



రాష్ట్రంలో ప్రస్తుతం 2.65 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడం జరుగుతుందని, ఆయిల్ పథకాన్ని అమలు చేయడంలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలోఉందని, రానున్న 4 సంవత్సరాలలో రాష్ట్రంలో పామాయిల్ పంటను 10 లక్షల ఎకరాలకు రాష్ట్రంలో విస్తరించడానికి ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. కూరగాయలు, పండ్ల తోటలతో పాటు–గా జాజి, వక్క, మెకడమియా లాంటి అన్ని పంటలను పండించడానికి తెలంగాణ నేలలు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. భవిష్యత్తు అంతా హార్టికల్చర్ దే అని నేను భావిస్తున్నానని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగడానికి ఉద్యానపంటలు ఒక గ్రోత్ ఇంజన్ గా నిలుస్తున్నాయని మంత్రిగారు పేర్కొన్నారు. హార్టికల్చర్ శాస్త్రవేత్తలు, రైతులు హార్టికల్చర్ పంటలు సాగుచేయడానికి అవసరమైన పరిశోధనలను విస్తృతం చేసి, సూచనలు సలహాలు అందించాలని మంత్రిగారు పేర్కొన్నారు. యూనివర్సిటీ–లో పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక బోధన విషయాలలో పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రిగారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకమిషన్ చైర్మన్ శ్రీ కోదండ రెడ్డి గారు, వైస్ చాన్స్ లర్ రాజిరెడ్డి గారు, వ్యవసాయశాఖ సెక్రటరి శ్రీ రఘునందన్ రావు గారు, వ్యవసాయ కమిషన్ సభ్యులు మరియు యూనివర్సిటి ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# గణపురంలో పర్యటించిన ఎమ్మెల్యే జీఎస్సార్

- పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే..
- అధైర్యపడొద్దు.. అండగా ఉంటానన్న ఎమ్మెల్యే..



**తొలి అక్షరం/గణపురం, 19 ఆగస్టు:** ఈరోజు(మంగళవారం) సాయంత్రం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి, బుద్దారం గ్రామాలల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు పర్యటించారు. ముందుగా లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొగిలి కోమల కొంతకాలంగా అనారోగ్యం బారిన పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోమల అంతిమ యాత్ర లో పాల్గొని పార్థీవ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బుద్దారం గ్రామంలో పెరుమాండ్ల మొగిలి, బండి శాంతమ్మ ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను కూడా ఎమ్మెల్యే వారి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఎల్లవేళలా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమాలల్లో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# శ్రీ ఉమా మహేశ్వర సేవ సమితి ఆధ్వర్యంలో సామూహిక చాలీసా పారాయణం..



**తొలి అక్షరం/గణపురం, 19 ఆగస్టు:** ఘనపూర్ మండలం ధర్మారావుపేట ఉత్తరముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణమాసం శుక్లపక్షం ఏకాదశి మంగళవారం రోజునా శ్రీ ఉమా మహేశ్వర సేవ సమితి ఆధ్వర్యంలో స్వామి వారికీ చందనోత్సవం తమలపాకుల తోరణాలు జిల్లేడు దండలతో పాటు సామూహిక చాలీసా పారాయణం చేయడం జరిగిందని సేవ సమితి అధ్యక్షులు ఆకుల సుభాష్ ముదిరాజ్ తెలిపారు వచ్చిన భక్తులకు సకల్పం చెప్పి తీర్థ ప్రసాదాలు ఆలయ అర్చకులు బెనికి రాజేందర్ అందించారు.. ఈ సంవత్సరం పాడిపంటలు సమృద్ధిగా ఉండి ఆయురారోగ్యాలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అందరిపై ఆ స్వామి కరుణకటాక్షలు మెండుగా ఉండాలని ఉత్తరముఖ ఆంజనేయ స్వామిని కోరామన్నారు.ఈ కార్యక్రమంలొ కమిటీ సభ్యులు వాలా నర్సింగరావు బెతి రవీందర్ దూలం శంకర్ ఆకుల దామోదర్ బాపని సాంబయ్య పనికెలా శివకృష్ణ సింగం రాజవిరు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# సీజన్ వ్యాధుల నివారణకై గ్రామాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలి

- సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలలో సీజన్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య సిబ్బందిని మందులను ప్రజలకు అందుబాటులో ఉంచి సీజన్ వ్యాధులు నివారణకు గ్రామాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల బిక్షం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాలలో విష జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డెంగ్యూ చికెన్ గున్యా మలేరియా టైప్ లాంటి సీజన్ వ్యాధులు వివిధ మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ వైద్యం పొందలేక ప్రభుత్వం ఆస్పత్రిలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించడంతో పాటు నీటి ట్యాంకులను శుభ్రం చేయటం దోమల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సబ్ సెంటర్లో ఆరోగ్య సిబ్బందిని మందులు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. వైద్య బృందం సర్వే నిర్వహించి గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి అని వేముల బిక్షం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మద్రిపల్లి మల్లయ్య, బండ బీరయ్య, శ్రీరామోజు మల్లాచారి, శ్రీను,వెంకట్ రెడ్డి, మారుపాక యాదయ్య, తుమ్మల సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కేహెచ్ఆర్ ఫౌండేషన్ నుంచి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామానికి చెందిన కట్టెకోల ప్రభాకర్ ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. వారి కుటుంబాన్ని కొరటికల్ తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ పరామర్శించి కే హెచ్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి సహాయంతో వారి కుటుంబానికి 5000? రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరకుడు బిందెల సైదులు, మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం, బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు చుంచు నాగరాజు, గౌడ సంఘం మాజీ అధ్యక్షులు బస్వ వీరస్వామి గౌడ్,మాజీ వార్డు సభ్యులు ఎలిమినేటి గోపాల్, సీనియర్ నాయకులు జోగు స్వామి, కుమ్మరి కుంట్ల యాదయ్య, కోల నరేష్, బొంత విగ్నేష్,తదితరులు పాల్గొన్నారు.

# కూలీ పనోళ్ళు కాదు బడి పిల్లలే... !

- ఇక్కడ పని చేస్తున్నది కూలీ పనోళ్ళు కాదు బడి
- ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్





**తొలి అక్షరం/నరసింహుల పేట ఆగస్టు 19:** ఇక్కడ పని చేస్తున్నది కూలీ పనోళ్ళు కాదు బడి పిల్లలే..! విద్యార్థులను కూలీలుగా మార్చేశారు ఆ పాఠశాల ఉపాధ్యాయులు. మహబూబాబాద్ జిల్లా నరసింహుల పేట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బడి పిల్లలతో పనులు చేపిస్తున్న ఉపాధ్యాయులు గ్రామ పంచాయతీ పాలక వర్గం లేక విద్యార్థులు పని చేస్తున్న దృశ్యం కనిపించింది. కూలీలతో చేయించాల్సిన పనులను విద్యార్థులతో ఉపాధ్యాయులు .ఇటువంటి పనులు చేయించడం విద్యార్థుల స్వేచ్ఛ, గౌరవాలకు భంగకరమని విద్యాహక్కు చట్టం చెబుతున్నా ఈ పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని మండల తల్లిదండ్రులు పలు సంఘాల నాయకులు కోరుతున్నారు

# సిపిఐ ఆత్మకూరు పట్టణ నూతన కమిటీ ఎన్నిక



సిపిఐ పట్టణ కార్యదర్శిగా మజ్జిగ నర్సయ్య



సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శిగా ఇంజమూరి నరసింహ

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం సోమవారం రోజున సాయంత్రం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆత్మకూరు పట్టణ శాఖ మహాసభ కామ్రేడ్ యాస బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సిపిఐ ఆత్మకూరు మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్ హాజరై వారు సంయుక్తంగా మాట్లాడుతూ ఆత్మకూరు(ఎం) మండలంలో పలు గ్రామాలలో అర్హులైన పేదలకు ఇల్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. నూతనంగా వితంతు, వికలాంగులకు,వృద్ధాప్య పెన్షన్లకు దరఖాస్తు చేసుకునే విధంగా అవకాశం కల్పించాలని అన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఆత్మకూరు పట్టణ శాఖ కార్యదర్శిగా మజ్జిగ నరసయ్య, సహాయ కార్యదర్శిగా ఇంజమూరి నరసింహ, వీరితోపాటు 11 మందిని కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఎండి నయీమ్, మండల కార్యవర్గ సభ్యులు బొబ్బల లాల్ రెడ్డి, పట్టణ శాఖ నాయకులు సుల్తాన్ పురుషోత్తం, పంజాల వెంకటేష్, సుల్తాన్ శీను, పోతగాని శివలింగం,రేగు సోమయ్య, విద్యార్థి నాయకులు యాస సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాయపురం నరసింహులు,జిల్లా కోశాధికారి తునికి దశరథ, మండల ప్రధాన కార్యదర్శి కోల నరేష్ కుమార్, కోశాధికారి సీసా రాజేష్,జిల్లా సలహాదారుడు ఇప్పకాయల ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులు వట్టిపల్లి శివకుమార్, సహాయ కార్యదర్శి కల్లెం తిరుమలేష్, కార్యవర్గ సభ్యులు రాయపురం శేఖర్, గంజి వెంకటేష్, జన్నె రవి, బిట్టుకూరి వినయ్, మాణిక్యాల ఈశ్వర్,మండల సీనియర్ ఫోటోగ్రాఫర్లు కోల లింగం, రాయపురం భాస్కర్, వెంగల్ దాస్ శ్రీకాంత్, చింతల ఉదయ్, అశోక్, ఉదయ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత.. అన్నదాతల కలత

- పోలీస్ పహారాలో యూరియా పంపిణీ
- బారులు తీసిన రైతులు
- అధిక ధరలు అంటే కఠిన చర్యలు తప్పవు: అధికారులు





**తొలి అక్షరం/నర్సింహులపేట, ఆగస్టు19:** నర్సింహులపేటలో యూరియా దొరక్క అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు.ప్రాథమిక సహకార సంఘాలు,ఆగ్రోస్ కేంద్రాలు,ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా రైతులకు సరిపడా అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు.మంగళవారం నర్సింహుల పేట మండల కేంద్రంలో రైతులు ప్రైవేటు డీలర్ల దుకాణాల వద్ద బారులు తీరారు.మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు,పోలీసు యంత్రాంగం పహారాలో రైతులకు ప్రతి ఒక్కరికి రెండేసి చొప్పున క్యూలో నిలబెట్టి గొడవలు లేకుండా పంపిణీ చేస్తున్నారు.ప్రైవేట్ డీలర్లు యూరియాను నిల్వ ఉంచారని కొంత మంది రైతులు ఆందోళనకు దిగడంతో స్పందించిన అధికారులు,స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు వినయ్ కుమార్,మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్,తహసిల్దార్ రమేష్ బాబు,ఎస్ఐ సురేష్ లు డీలర్ల దుకాణాల్లో నిల్వ ఉంచిన యూరియాను తనిఖీ చేసి రైతులకు నచ్చజెప్పి గొడవలకు తావు లేకుండా పంపిణీ చేశారు.నానో యూరియాను రైతులు వాడుకోవాలని సూచనలు చేసి సలహాలు చేశారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి ఏవో వినయ్ కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రం తోపాటు పలు ఫర్టిలైజర్ షాపులలో యూరియా బ్లాక్ లో అమ్ముతే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు

# యూరియా నిలువల గురించి తనిఖి

- నిర్వహించిన మండల అధికారులు స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్, వ్యవసాయ అధికారి



**తొలి అక్షరం/దంతాలపల్లి ఆగస్ట్ 19:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి. వీరన్న తహసీల్దార్ సునీల్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి వాహిని కలిసి యూరియా నిలువల గురించి జాయింట్ ఫర్టిలైజర్ ఇన్స్పెక్షన్ నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలలో భాగంగా వారు దంతాలపల్లిలోని ఫర్టిలైజర్ షాపుల గోడౌన్లను పరిశీలించడం జరిగింది.ఏఈఓలు శాపు యజమానులు ఉన్నారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అతిథి ఉపాధ్యాయ పోస్ట్కు దరఖాస్తుల ఆహ్వానం



**తొలి అక్షరం/దంతాలపల్లి ఆగస్ట్ 19:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అతిథి ఉపాధ్యాయ పోస్ట్కు దరఖాస్తుల ఆహ్వానంఆసక్తి కలిగిన మహిళ అభ్యర్తులు దరఖాస్తు చేసుకోవలసిందిగా మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి మంగళవారం రోజున పత్రిక ప్రకటనలో తెలియజేసారు .మండల కేంద్రంలో గల కేజీబీవీ పాటశాలలో అతిథి ఉపాధ్యాయ సీఆర్టీ ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించుటకు ఒక ఖాళీ కలదు మహబూబాబాద్ జిల్లా లో గల ఆశక్తి కలిగిన మహిళా అభ్యర్థులు కేజీబీవీ ప్రత్యేక అధికారి దంతాలపల్లి నందు ఆగస్టు 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరాఖాస్తులు అందజేయలవలసిందిగా కోరడమైనది. అర్హతలు-1. మహబూబాబాద్ జిల్లా వాసి అయ్యుండవలెను2.డిగ్రీ B.SC lo ఫిజిక్స్ ఉండవలెను.3.బి.ఎడ్ లో ఫిజిక్స్ మెథడాలజీ సబ్జెక్ట్ తప్పనిసరిగా కలిగి ఉండవలేను.

# చౌటుప్పల్‌లో ఇండియన్ మెడికల్ హెూల్ సేల్ షాపు ప్రారంభం

- కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో తిరందాసు హనుమంతుకి చెందిన భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ మెడికల్ హెూల్ సేల్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చౌటుప్పల్ పురపాలక మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మరియు షాపు యాజమాన్యం వెంకటేష్ గౌడ్ మరియు పార్ట్నర్స్ ఈ కార్యక్రమంలో ఆవుల ఏసు, చిలువేరు శ్రీశైలం,ఎజాస్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్‌కి ధన్యవాదాలు తెలిపిన కొలనుపాక గ్రామస్తులు

**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ లో భాగంగా కొలనుపాక గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఇనుప స్తంభాలు గ్రామ వీధుల్లో ఇబ్బందికరంగా ఉండటాన్ని గమనించి వెంటనే సిమెంట్ స్తంభాలను తెప్పించి గ్రామంలో నాటించడం జరిగింది. దీనికిగాను గ్రామస్తులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి ధన్యవాదాలు తెలిపారు.వీరివెంటా కాంగ్రెసు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## బొంగు రాములు పార్థివదేహానికీ నివాళులు అర్పించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన బొంగు రాములు మరణించగా వారి పార్థివదేహాన్నీ సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్,ఆలేరు మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**- అర్పించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** తెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు. మొగలాయి దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.వీరివెంటా కాంగ్రెసు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాయగిరి జడ్పీహెచ్ఎస్‌ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపల్ పరిధిలోని రాయగిరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు.విద్యార్థులతో పాటుగా ప్రార్థనలో కలెక్టర్ భారీగా వర్షాలు పడుతున్నాయి విద్యార్థులు జాగ్రతగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇండ్లలో ఉండకూడని సూచించారు.గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న మీయొక్క టీచర్స్ కి తెలియజేయగలరు అని విద్యార్థులతో అన్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం అందచేసిన రేహశ్రీ ఫౌండేషన్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెపహాడ్ గ్రామంలో ఇటీవల గ్రామంలో గజ్జల్లి హరిబాబు తండ్రి యాద గిరి అనారోగ్యంతో స్వర్గస్తులైనారు. వారి మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి రేహశ్రీ ఫౌండేషన్ తరుపున కొత్తపల్లి గోవర్ధన్ 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది.

## మంత్రి కొండా సురేఖకి జన్మదిన శుభాకాంక్షలు

**- తెలిపిన తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్పసన్ బండ్రు శోభారాణీ**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి మంగళవారం రోజున జన్మదినోత్సవం.ఈ సందర్భంగా శుభాకాంక్షలు తేలియజేసిన తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్పసన్ బండ్రు శోభారాణీ.

## ఘనంగా ప్రపంచ ఫోటో గ్రాఫి దినోత్సవ వేడుకలు




**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు యాస సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఆత్మకూరు(ఎం) మండల ప్రధాన కార్యదర్శి ఎలాగందుల మహేష్, జిల్లా సలహాదారులు గజరాజు కాశీనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్టేకోల రమేష్, మండల గౌరవ అధ్యక్షులు ఉగ్గే నరేష్,కార్యవర్గ సభ్యులు రంగ పరుశరాములు, వంగరి మహా ఋషి,కొండపల్లి సాంబా, నాగుల నరేష్, నాగరాజు, చిత్రాల అనిల్ గౌడ్, ఎస్.కె ముస్తఫా, వేముల నవీన్, చెరుకు శివాజీ ,కోల సాయి, అఖిల్, కట్టెకోల ప్రవీణ్, ఎలిమినేటి శ్రీకాంత్, ఓకే ప్రమోద్, సాయి ,తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి మండపం బతుకమ్మ ఆడే స్థలానికి సీసీ పనులు ప్రారంభం

- **నిన్నటి రోజు మాట ఇచ్చిండు మరుసటి రోజున పనులను ప్రారంభించేసిన ప్రజాసేవకుడు బీర్ల ఐలన్న**
- **ఇచ్చిన మాట తప్పని ప్రజాసేవకుడు బీర్ల ఐలన్న**
- **ప్రజలకు సేవే ప్రాణంగా జీవించే నాయకుడు బీర్ల ఐలన్న**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సోమవారం రోజున ఆలేరు మున్సిపాలిటీ 6వ వార్డ్ బహదూర్ పేటలో పర్యటించి కృష్ణరెడ్డి నగర్ కాలనీలో వినాయకుడి మండపం మరియు మహిళలు బతుకమ్మ ఆడే స్థలం వర్షం కారణంగా మొత్తం నీళ్లు నిలిచి బురద మయంగా మారడంతో అక్కడ మొత్తం సీసీ పోయిస్తా అని మాట ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం రోజే అక్కడ పనులు ప్రారంభించడం జరిగింది. బహదూర్ పేట ప్రజలు సంతోషంతో బీర్ల ఐలయ్యకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు

## గణపురంలో ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

- **ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్ల పంపిణీ**



**తొలి అక్షరం/గణపురం, 19 ఆగస్టు:** ఫోటోగ్రఫీ పితామహుడు ఫోటో కెమెరా టెక్నాలజీని అభివృద్ధి చేసి, ఫోటోగ్రఫీ సాంకేతికతను , కళను ప్రపంచానికి తెలియజేసిన లూయిస్ మాండే డాగురే జన్మదినాన్ని మంగళవారం గణపురం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.గణపురం హనుమాన్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని డాక్టర్ అల్లూరి అనూష చేతుల మీదుగా పండ్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ మండల అధ్యక్షులు యండి షేక్ మదర్ గౌరవ అధ్యక్షులు మోరె రాజు నాగపురి శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శి ఇంజపెల్లి కిరణ్ సహాయ కార్యదర్శి లావుడ్య వినోద్ కుమార్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో వీర జవాన్ నీరటి చంద్రశేఖర్ జవాన్ రెండవ వర్ధంతి

**అమర్ రహే అమర్ రహే చంద్రశేఖర్ అమర్ రహే అంటూ నివాళులర్పించరు**

**తొలి అక్షరం/కొందుర్గు,ఆగస్టు19:** స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో వీరమరణం పొందినటువంటి షాహిద్ వీర జవాన్ నీరటి చంద్రశేఖర్ ముదిరాజ్ జవాన్ రెండవ వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షులు పెరుమల్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జేనిగా వినోద్ కుమార్, సోషల్ మీడియా ఇంచార్జ్ మూతమోల్ల నరేష్ ,అదే విధంగా సేవాసమితి సభ్యులు శివకుమార్, శ్రీకాంత్, హరీష్,శ్రీకాంత్, మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులర్పించడం జరిగింది.



## డిల్లీ జంతర్ మంతర్ వద్ద ఈ డబ్ల్యూఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ధర్నా







**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 19:** ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చౌక్ లో జాతీయ స్థాయిలో ఈ డబ్ల్యూ ఎస్ కమిషన్ మరియు ఈ డబ్ల్యూ ఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ ఈ కార్యక్రమం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో మంగళవారం రోజున జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రెడ్డి జాగృతి తరపున, ఆర్థికంగా బలహీన వర్గంగా జీవిస్తున్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి వంచించ బడుతున్న అగ్రవర్ణ సమాజాల పరిస్థితిని మీ దృష్టికి తీసుకురావడం అలాగే ఈ సమాజాల్లోని కుటుంబాలు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం, చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు కావలసిన ఆర్థిక వనరులు లభించకపోవడం, తగిన వ్యవసాయ సబ్సిడీలు అందకపోవడం వలన తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నారు. కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు భరించలేక అనేక దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి."అగ్రకులం" అనే కారణం పదిమందికి సహాయం చేసే గుణం వలన వారికి ఇబ్బంది వచ్చినప్పుడు వీరు అటు బహిరంగంగా సహాయం అడగలేక ఇటు ప్రభుత్వ సహాయం అందక అనేక అవమానాలు, ఇబ్బందులు పడుతున్నారు. కావున జాతీయ స్థాయిలో ఈ డబ్ల్యూ ఎస్ కమిషన్ మరియు ఈ డబ్ల్యూ ఎస్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ రెడ్డి జాగృతి డిమాండ్ చేస్తుంది. అలాగే ఈ డబ్ల్యూ ఎస్ ఫార్వర్డ్ కమ్యూనిటీ కూడా పాల్గొనడం జరిగింది.ఈ నిరసన కార్యక్రమంలో రెడ్డి జాగృతి వ్యవస్తాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవ రెడ్డి, రెడ్డి జాగృతి వ్యవస్థాపక సభ్యులు నీరుడు దయాకర్ రెడ్డి, మరియు హరిశ్వర్ రెడ్డి,రెడ్డి జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోరెడ్డి కవిత రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మేక సోమిరెడ్డి, అగ్రవర్ణ పేదల సమితి పెంజర్ల మహేందర్ రెడ్డి, అలాగే రెడ్డి జాగృతి వివిధ జిల్లా అధ్యక్షులు దేవుడి నర్సింహా రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మెండు శ్రీకాంత్ రెడ్డి, స్వప్న రెడ్డి, దుర్గ రెడ్డి,రాఘవేంద్ర రెడ్డి మరియు ఇతర రాష్ట్రాల ముక్యులు,తదితరులు పాల్గొనడం జరిగింది.

## ప్రజా సంక్షేమమే నా ధ్యేయం అంటున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య సూచన అంటూ వారు వర్షాలు తగ్గేవరకు చెరువులలో చేపల వేటకు వెళ్ళవద్దని పర్యాటకులు కూడా సరదాగా చెరువుల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగవద్దని విలువైన తమ ప్రాణాలు కోల్పోవద్దని ఒకవేళ అత్యవసర సమయంలొ చెరువుల వద్దకు వెళ్లేటప్పుడు, జాగ్రత్తలు పాటించండని అన్నారు. చేపల వేటకు వెళ్లేటప్పుడు అధికారులకు పోలీసులకు సమాచారం ఇయ్యండని అన్నారు.అత్యవసర సమయంలొ ఏదైనా జరగరాని సంఘటన జరిగితే,మీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి సమాచారం అందించండి.లేదా నేరుగా పోలీసు వారికి ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వండి.మూసీ నది ఉధృత ప్రవాహం ఎక్కువ ఉన్నందున వాగులు చెరువులు వద్దకు వెళ్ళకండని భువనగిరి నియోజకవర్గ సహకార సంఘాల సభ్యులు జాగ్రత్తగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమాచారం అందించాలని ఏదైనా అత్యవసర సమయంలొ నేరుగా మీ ఎమ్మెల్యేగా నాకు కూడా ఫోన్ చేసి సమస్యలు తెలపండని అన్నారు. ఎల్లప్పుడు మీకు అందుబాటులో ఉంటాను ప్రజా సంక్షేమమే నా ధ్యేయం అంటున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.

## జర్నలిస్టుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించాలి

- **తెలంగాణా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:**జర్నలిస్టుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించి, ఆదుకోవాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా అన్నారు. ఎస్వీ కాన్ఫరెన్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించి ఆదుకోవాలని అన్నారు. సరైన సమయంలో వైద్యం అందక జర్నలిస్టులు మృతిచెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు కల్పించిన హెల్త్ కార్డు అన్ని కార్పోరేట్ హాస్పిటల్లో చెల్లుబాటు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కురుస్తున్న భారీ వర్షాలకు జర్నలిస్టులు వార్త సేకరణలో భాగంగా పలు జాగ్రత్తలు తీసుకొని వార్తా సేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా ప్రచార కార్యదర్శి సిరిల్, రాష్ట్ర నాయకులు సుక్క అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు రషీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ఆగస్టు : 19:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైస్ సేవా కేంద్రం ఫర్టిలైజర్ షాపును మంగళవారం రోజు అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు. తనిఖీ లో భాగంగా షాపులోని స్టాక్ రిజిస్టర్లను స్టాకును పరిశీలించి ఎరువులు ఎవరికి అమ్మిన కొన్న రైతు పేరు తప్పనిసరిగా రిజిస్టర్ లో నమోదు చేయాలని రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్డేట్ లో ఉంచాలని షాప్ యజమానికి తెలిపారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట మండల తాసిల్దార్ జి దశరథ అగ్రికల్చర్ ఏవో అంజలి ఆర్ ఐ కరుణాకర్ రెడ్డి ఏఈఓ సాయి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

- ఏర్పాట్లు చేసి, సమన్వయం చేసుకోవాలి
- సమావేశంలో సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో,ఆగస్టు 19:** సెప్టెంబర్ 13 జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించి సత్వర పరిష్కార మార్గం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత సమన్వయ సమావేశం నిరహించారు. ఈ సమావేశంలో జడ్జీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, మోత్కూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, రామన్నపేట, వలిగొండ, అడ్డగుడూరు ఎస్ఐ లు నాగరాజు, యుగేందర్ గౌడ్, వెంకట్ రెడ్డి, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఆర్యుబి నిర్మాణానికీ పరిశీలన చేసిన రైల్వే, ఆర్ అండ్ బి,మునిపాలిటీ అధికారులు



**తొలి అక్షరం/కేసముద్రం ఆగస్టు 19:** ఈరోజు కేసముద్రం రైల్వే ఆర్ యు బి, నిర్మాణం చేసే చోట ఇంజనీర్లు మ్యాప్ తో మంగళవారం పరిశీలన చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒలం శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి మొదటి నుండి కార్యక్రమం చేయగా,అందులో భాగంగా నిర్మాణం పనులను ప్రారంభిచెందుకు రైల్వే సినియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఏఈ ప్రశాంత్ తో నిర్మాణం చేసే ప్లాను పరిశీలించి పనులను ప్రారభించునున్నట్లు తెలిపారు. ఇంతకు ముందు ఉన్న పాత గేట్ స్థానంలోనే ఆర్యుబి నిర్మాణం చేస్తారని, ట్రాక్ ఇరువైపులా 5 మీటర్ల వరకు గడ్డర్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిదంగా అండర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని బట్టి ఇరువైపులా ( అంబేద్కర్, అమరవీరుల స్తూపం) సుమారు 50 మీటర్ల వరకు సైడ్ వాల్స్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ అండర్ బ్రిడ్జ్ కోసం 10/10 ఫిట్ల గడ్డర్స్ ( బాక్స్ ) పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు వివరించారు. రెండు మూడు రోజుల అనంతరం ఉన్నతధికారులు కూడా పరిశీలనకు వచ్చే వీలుందని, వర్షాల నేపథ్యంలో రైల్వే ఆర్యుబి పనులు ఆలస్యం అయ్యాయని, వర్షాలు తగ్గు ముఖం పట్టగానే పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు..

# దేశంలోనే తొలిసారిగా ఎనర్జీ ఆడిట్ నిర్వహించిన యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం

**మూడు ఐఎస్ఓ సర్టిఫికేట్లు, గుడ్ గవర్నెన్స్ సర్టిఫికేషన్లు లభించిన ఆలయం**





**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం దేశంలోనే తొలిసారిగా ఎనర్జీ ఆడిట్ నిర్వహించిన ఆలయంగా చరిత్ర సృష్టించింది.ప్రత్యేకతను సంతరించుకుంది. స్వామివారి అన్నప్రసాదాల నాణ్యత,భక్తులకు కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాలు, సంతృప్తికరమైన దర్శన ఏర్పాట్లు, శుభ్రత,పర్యావరణ పరిరక్షణ, పారదర్శక పరిపాలన వంటి అంశాలలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించడమే కాకుండా,సమగ్ర నిర్వహణలోనూ ఈ ఆలయం ఆదర్శంగా నిలిచింది. ఈ కృషికి గుర్తింపుగా ఆలయానికి మూడు ఐఎస్ఓ సర్టిఫికెట్లు (ISO 9001, ISO 22000 మొదలైనవి) మరియు గుడ్ గవర్నెన్స్ సర్టిఫికేషన్లు లభించడం గర్వకారణం.ఇలాంటి విశిష్టతను సాధించినందుకు ఆలయ అధికారులు,సిబ్బంది అందరికీ హృదయపూర్వక అభినందనలు.

# మండల స్థాయి క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోగలరు

- గవ్వ.జ్యోతి రామన్నపేట ఎంఈఓ



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 19:** రామన్నపేట మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు మాత్రమే క్రీడా పోటీలు నిర్వహించి సెలక్షన్ జరుపబడును నిర్వహించే క్రీడలు వాలీబాల్ అండర్ 14మరియు అండర్ 17.ఖోఖో అండర్14 మరియు 17.కబడ్డీ అండర్ 14మరియు 17.పైన తెలిపినటువంటి క్రీడలను అండర్ 14, మరియుఅండర్ 17 బాలికలకు23-8-2025 శనివారం నాడు మరియు బాలురకు 25-8-2025 సోమవారం నాడు స్థానిక గవర్నమెంట్ హై స్కూల్ రామన్నపేట క్రీడా మైదానంలో క్రీడలునిర్వహించి మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి సెలక్షన్ చేయబడును కావున మండలంలోని అన్ని ప్రైవేటు మరియు ప్రభుత్వ మరియు గురుకుల పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల యాజమాన్యాలకు ఇందుమూలంగా తెలియజేయునైనది ఈ సమావేశంలో పెద్దబోయిన మణి పిడి జెడ్ పి హెచ్ ఎస్ ఇంద్ర పాలనగరం రేణుక పిడి వెల్లంకి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది ఏదైనా సందేహాల కొరకు క్రింది వారిని సంప్రదించగలరు పెద్ద బోయిన మణి పిడి 9912779091 ముఖ్యమైన గమనిక: ఆయా పాఠశాలలకు సంబంధించిన క్రీడాకారుల యొక్క వివరాలను సంబంధిత క్రీడాకారులు బోనాఫైడ్ ను కచ్చితంగా వెంట తీసుకు రాగలరు

# కాంగ్రెస్ పార్టీ రైతు ప్రభుత్వం

**కేంద్రంలో బిజెపి యూరియా కొరతతో రైతుల గోసపంచుకుంటుంది..**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంబాటి మహేందర్ రెడ్డి....**



**తొలి అక్షరం/కేసముద్రం ఆగస్టు 19:** కేసముద్రం మున్సిపాలిటీ అమీనాపురంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 9 రోజులలో 9000 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేసిన ఘన చరిత్ర కలిగినటువంటి పార్టీ కాంగ్రెస్ పార్టీ, గత మూడు రోజుల నుండి ఈ నియోజకవర్గంలో యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందుతూ, కొన్ని పక్షాలు ధర్నాలు చేయడం కాంగ్రెస్ పార్టీని విమర్శించడం దీనికి కారణమైన కేంద్ర ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఖరీఫ్ సీజన్లో 9.80 లక్షల టన్నుల యూరియాను సరఫరా ఏప్రిల్ ,మే ,జూన్, జూలై ,ఆగస్టు నెలల వారి కోట పంపిణీ చేయకుండా దానిలో కోత విధించి. ఈ రాష్ట్రంలో రైతాంగం కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నదని కక్ష సాధింపు చర్యలో భాగంగానే సరఫరా చేయకుండా రైతుల గోస పంచుకుంటుందని, కేవలం 5.32 లక్షల టన్నులను మాత్రమే యూరియా సరఫరా చేసినారు. దీనివల్ల కాంగ్రెస్ పార్టీపై రైతుల కు చెడు అభిప్రాయం రావాలనే దురుద్దేశం వారి లక్ష్యం. కానీ మహబూబాబాధ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ గారు యూరియా కొరత గురించి ప్రభుత్వం దృష్టికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి గిరిజన ప్రాంతం కాబట్టి ఎక్కువ కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అదేవిధంగా మన మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ గారు పార్లమెంటు లో తెలంగాణలలో యూరియా కొరత గురించి మిగతా కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో కలిసి ధర్నా చేయడం జరిగింది. వెంటనే తెలంగాణకు రావలసిన యూరియా కేటాయింపులు కేటాయించి సరఫరా చేయవలసిందిగా ఈ సందర్భంగా డిమాండ్ చేసినారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల.రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాయడమే కాకుండా ప్రత్యక్షంగా మంత్రులను కలిసి యూరియా కేటాయించవలసిందిగా కోరినా కూడా కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం వివక్ష చాటింది. వెంటనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారంగా యూరియాను సరఫరా చేయవలసిందిగా ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ బానోత్ . బద్రు నాయక్, మండల ఉపాధ్యక్షులు కళ్లెం. శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు సామ సుధాకర్ రెడ్డి, యార. సాగర్, లాకావత్ బాలు, కాసు సతీష్ పాల్గొన్నారు

# యూరియా కొరతతో అన్నదాత ఆవేదన ..

- రైతులకు విడతల వారిగా అందరికీ అందిస్తామన్న అధికారులు...



**తొలి అక్షరం/కేసముద్రం ఆగస్టు 19:** రైతులకు పిఎసిఎస్ కేసముద్రం సొసైటీకి కేసముద్రం పాయింట్ కు 222 యూరియా బస్తాలు, కల్వల పాయింట్ కు 222 బస్తాలు, మరియు పిఎసిఎస్ ధనసరి సొసైటీకి ఉప్పరిపల్లి పాయింట్ కు 222 బస్తాలు, పెనుగొండ పాయింట్ కు 222 బస్తాలు వ్యవసాయ శాఖ మరియు పోలీస్ శాఖ, ప్రాథమిక సంఘం ఆధ్వర్యంలో కేసముద్రం మండలంలోని రైతులకు పట్టాదార్ పాస్ బుక్ మరియు ఆధార్ కార్డు ఆధారంగా ప్రతి రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి గౌరవనీయులు మహబూబాబాద్ అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ శ్రీ కే. అనిల్ కుమార్ కేసముద్రం సొసైటీ మరియు ఉప్పరపల్లి సొసైటీ మరియు, కల్వాల సొసైటీలను, మరియు కేసముద్రం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను, మహబూబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాల కులు శ్రీ అజ్మీరా శ్రీనివాసరావు మరియు మండల వ్యవసాయ అధికారి కే సంద్రం బి వెంకన్న, డిటి కేసముద్రం ఎర్రయ్య గార్లతో కలిసి పంపిణీ జరిగిన విధానము మరియు, గోదాము బ్యాలెన్స్ స్టాక్ రిజిస్టర్ బ్యాలెన్స్, పి ఓ ఎస్ మిషన్ బాలన్స్ లను తనిఖీ చేయడం జరిగింది, వారు రైతులతో ఇంటరాక్షన్ అయి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ రైతులకు ఈ వర్షాకాలం సీజన్లో కావలసిన యూరియా ను విడతల వారీగా తెప్పించి రైతులకు సరఫరా చేస్తామని, రైతులు ఎవరు అధైర్యపడవద్దని, ఎరువుల డీలర్లు ఎవరైనా, యూరియా ను అధిక ధరలకు విక్రాయించిన, ఉండి ఇవ్వక పోయిన, ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, అదేవిధంగా నానో యూరియాను అలవాటు చేసుకోవాలని వారు సూచించారు. పోలీస్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ సర్వయ్య గారు,, కేసముద్రం స్టేషన్ హౌస్ ఆఫీసర్ గార్లు, శ్రీ మురళీధర్ రాజ్, కర్ణాకర్ గార్లు, ఆ క్లస్టర్ ల వ్యవసాయ విస్తరణ అధికారులు, సీఈఓ లు, పోలీస్ శాఖ సిబ్బంది, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్లంకి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 19:** రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను . వెల్లంకి గ్రామపంచాయతీ దగ్గర నిర్వహించాము ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాం భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి. దళిత, బహుజన, మైనార్టీలతో కలిసి. ప్రజారాజ్యాన్ని నిర్మించిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్నది అని తాటిపాముల స్వామి కొనియాడారు. ఈ కార్యక్రమంలో. మాజీ ఎంపీటీసీ శేఖర్ గౌడ్. తాటిపాముల శివ కృష్ణ గౌడ్. తాటిపాముల కిరణ్ గౌడ్. తాటిపాముల శ్రీశైలం గౌడ్. తాటిపాముల మహేష్ గౌడ్ పాలెం స్వామి పున్న వెంకటేశం మాజీ ఎంపిటిసి బర్ల బాబురావు. కర్రే సంతు కుమార్. వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు



# చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం, తాజ్పూర్ గ్రామంలో చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి. మృతులో ఒకరు ఎస్.కె జహంగీర్ 52 సంవత్సరాలు ఆటో డ్రైవర్,మరో వ్యక్తి భువనగిరికి చెందిన వెంకటేష్ 53 సంవత్సరాలు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది


# లింగరాజుపల్లిలో ఘనంగా బోనాల పండగ

**ముత్యాలమ్మ వారికీ ప్రత్యేక పూజలు చేసిన మహిళలు**



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరిబ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం)మండలం లింగరాజుపల్లి గ్రామంలో ఘనంగా బోనాల పండగ నిర్వహించారు. ముత్యాలమ్మ వారికీ దుప దీప నైవేద్యాలతో మహిళాలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముత్యాలమ్మ వారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ పాడి పంటలు మంచిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.మహిళలు,చిన్నారులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఛాయాచిత్రం



**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** ఛాయా చిత్రం సుమధురమైన పాత జ్ఞాపకాల్ని తట్టిలేపేది.ప్రకృతి అందాలను పరిచయం చేసేది. సమాజంలోని విషయాలను వెలికితీసే విలేకరులకు సహాయపడేది.వాస్తవికతను బంధించి మన కోసం బావితరాలకోసం దాచిపెట్టేది.గత మధుర స్మృతులను తట్టి మేలుకొలుపి మనతో ముచ్చట్లు పెట్టేది.బావితరాలకు మార్గదర్శిగా నిలిచేది.ఎవరో కాదు మన ఛాయాచిత్రమే.అందరికీ అంతర్జాతీయ ఛాయాచిత్ర (ఆగస్టు 19 న)దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రచయిత్రి పత్తిపాటి మంజుల.

# డాక్టరేట్ పొందిన మజ్జిగ లక్ష్మణ్ జెట్ట రవీందర్లు






**తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19:** యాదాద్రి ఆత్మకూరు(ఎం)మండలం మంగళవారం రోజున ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవం కార్యక్రమంలో భాగంగా మజ్జిగ లక్ష్మణ్, ప్రభుత్వ పాలనా శాస్త్రంలో,జెట్ట రవీందర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో పిహెచ్డీ పట్టాను గవర్నర్, వీ.సి, ఇస్రో చైర్మన్ ల చేతుల మీదుగా అందుకోవడం జరిగింది.వీరు భవిష్యత్తులోనూ ఉన్నత స్థాయి లో రానించాలనీ ఆత్మకూరు గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని కోరుకుంటూన్నామని మీత్రులు గ్రామస్తులు కోరుతున్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన కరుణాకర్ రెడ్డి



**తొలి అక్షరం/గణపురం, 19 ఆగస్టు:** మండల కేంద్రానికి చెందిన కత్తి నవీన్ గౌడ్ వెడ్స్ శైలజ రిసెప్షన్ వేడుకలకు మంగళ వరం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి, హాజరు అయి నూతన వధూవరులను ఆశీర్వదించారు. యూత్ నాయకులు గాజర్ల చింటూ గౌడ్, మార్క సాయి గౌడ్, కార్తీక్ గౌడ్ ఎండి వాజిత్, పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన రామన్నపేట ఎంపీడీవో ఏ. రాములు



తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 19: రామన్నపేట మండలంలోని సిరిపురం, సర్నేనిగూడెం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులను ఎంపీడీవో ఏ. రాములు తనిఖీ చేయడమైనది. ఇట్టి సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరినారు.ఏపీఓ వెంకన్న పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, సుధ గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫోటోగ్రాఫర్స్ దినోత్సవం





తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 19: రామన్నపేట మండల ఫోటోగ్రాఫర్స్ నేషనల్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు అర్పించి తదుపరి కేక్ కటింగ్ చేయడం జరిగింది. రామన్నపేట ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ మండల అధ్యక్షులు మెడబోయిన ఉపేందర్ ప్రధాన కార్యదర్శి నామిని అశోక్ బాబు జిల్లా ప్రచార కార్యదర్శి భాష మల్ల సంతోష్ కుమార్ జిల్లా సహాయ కార్యదర్శి జినుక స్వామి మండల గౌరవ అధ్యక్షులు రుద్ర గణేష్ గౌరవ సలహాదారులు నాగటి యాదయ్య మాజీ అధ్యక్షులు మొగిలి రమేష్ నకిరేకంటి మహేష్ నాగటి రవి చిన్నగోని సైదులు పాల్గొన్నారు

## ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవం




తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 19: గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ,ముఖ్య అతిథిగా ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ.నారాయణన్ హాజరయ్యారు.హిందీ దళిత్ కహానియో మే చిత్రత్ దళిత్ జీవన్ కా యథార్థ్ మే 1980–2010 కే సందర్భ మే అను అంశం పై థీసిస్ సమర్పించిన సందర్భంగా ఈ రోజు నిర్వహించిన స్నాతకోత్సవం లో ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్ చేతుల మీదుగా నాగార్జున స్కూల్ కరెస్పాండంట్ నకిరేకంటి నాగరాజు డాక్టరేట్ పట్టా స్వీకరించడం జరిగింది.

## పిఆర్టి యుటిఎస్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

**- సెప్టెంబర్ ఒకటవ తేదీన జరిగే శాంతియుత మహా ధర్నాను విజయవంతం చేయాలి**




తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 19: వరంగల్ జిల్లా కొండ మండల కేంద్రం నుండి పి ఆర్ టి యు టిఎస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంగళవారం న నెక్కొండ మండల శాఖ ఆధ్వర్యంలో నెక్కొండ ఉన్నత పాఠశాలలో పి ఆర్టియుటిఎస్ సిపిఎస్ ధర్నా పోస్టర్ను ఆవిష్కరించడం జరిగినది. ఉద్దేశించి పిఆర్టియు నెక్కొండ మండల శాఖ అధ్యక్షులు మాలోత్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ సెప్టెంబరు ఒకటవ తేదీన రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాదులోని ఇందిరా పార్కులో నిర్వహించే శాంతియుత మహా ధర్నాను విజయవంతం చేయడానికి,మండలంలోని ఉపాధ్యాయులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని సిపిఎస్ రద్దు చేసుకొని పాత పెన్షన్ విధానాన్ని సాధించుటకు ప్రతి ఉపాధ్యాయుడు హాజరు కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్,మండల అసోసియేట్ అధ్యక్షులు ఐలయ్య కార్యదర్శి రామకృష్ణ నెక్కొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారావు ,శ్రీదేవి ,ఇక్బాల్ ఖాన్, రమేష్ ,సురేందర్ రెడ్డి ,లక్ష్మణ్, వినయ్ కుమార్ ,వెంకటేశ్వర్లు, నరసయ్య ,ప్రశాంత్ ,రంజిత్ ,పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ వ్యాపారాన్ని ఆక్రమించిన మార్వాడీలు

**• రోజురోజుకు పెరుగుతున్న మార్వాడీలతో ఉపాధి కోల్పోతున్న స్థానిక యువత • ఆ షాపుల్లో పనిచేసేదీ అక్కడివారే • అడ్డగోలుగా పెరిగిన షాపుల రెంట్లు • స్థానికులకు దక్కని ఉపాధి అవకాశాలు • ఉపాధి లేక నిస్సహాయులుగా మారుతున్న యువకులు • డూప్లికేట్ మాల్‌తో ప్రజల నిలువు దోపిడీ**




తొలి అక్షరం/యాదాద్రి భువనగిరి బ్యూరో, ఆగస్టు 19: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రం నాలుగైదు మండలాలకు మంచి వ్యాపార కేంద్రం. రవాణా పరంగా, ప్రధాన పట్టణాలైన నల్లగొండ, హైదరాబాద్, భువనగిరి, జనగాం, సూర్యాపేట జిల్లాలకు దగ్గరగా ఉండడంతో ఇక్కడ వ్యాపార లావాదేవీలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా... స్థానికంగా మాత్రం దుకాణాలను, వ్యాపార మార్కెట్ (బిజినెస్)ను మొత్తం మార్వాడీలు ఆక్రమించేశారు. దీంతో స్థానికులకు పూర్తిగా ఉపాధి అవకాశాలు కరువయ్యాయి. మార్వాడీల రాకతో ప్రస్తుతం స్థానికులు ఎవరైనా ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే షట్టర్ (అద్దె షాపు)దొరకని పరిస్థితి. ఒకవేళ దొరికినా మార్వాడీల పుణ్యమా అని షాపుల కిరాయిలు అమాంతం(వేలల్లో కిరాయిలు, లక్షలు అడ్వాన్సులు) పెరిగిపోయాయి. పోనీ ఉపాధి కోసం ఏదైనా షాపులో పని చేద్దామన్నా మార్వాడీల షాపుల్లో మొత్తం అక్కడి వారినే తెచ్చి పెట్టుకున్నారు. దీంతో స్థానిక యువకులు ఉపాధి లేక నిరుత్సాహంతో నిస్సహాయ స్థితిలో ఖాళీగా ఉండిపోతున్నారు. మోత్కూర్ వ్యాపారాన్ని ఆక్రమించిన మార్వాడీలు మోత్కూర్, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం)మండలాలతో పాటు శాలిగౌరారం,నార్కట్ పల్లి మండలాల్లోని పలు గ్రామాలకు మోత్కూర్ మున్సిపల్ కేంద్రం వ్యాపార కేంద్రంగా మారింది. గతంలో ఏ వస్తువు కావాలన్నా ప్రధాన పట్టణాలకు వెళ్లే ప్రజలు ప్రస్తుతం మోత్కూర్ లో దొరకని వస్తువంటూ ఏది లేకపోవడంతో వ్యాపార లావాదేవీలు బాగా నడుస్తున్నాయి. దీంతో మోత్కూర్ పై దృష్టి సాధించిన మార్వాడి వ్యాపారులు రోజురోజుకు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తున్నారు. టీ షాప్ నుంచి బట్టల షాపుల వరకు, స్వీట్ షాప్ నుంచి కిరాణం, స్టీల్, ఫర్నిచర్ షాప్ వరకు ఇలా అన్ని మార్వాడీలవే ఉన్నాయి. స్థానికుల షాపులతో పోల్చితే సింహభాగం సుమారు 40, 50 షాపులు వారివే ఉన్నాయి. ఆ షాపుల్లో రాజస్థాన్ కు చెందిన యువకులు పదుల సంఖ్యలో పనిచేస్తున్నారు. అడ్డగోలుగా పెరిగిన షాపుల రెంట్లు... ఓవైపు మార్వాడి వ్యాపారుల రాక, మరోవైపు మోత్కూరు మున్సిపల్ కేంద్రంగా ఏర్పడటంతో పట్టణంలో షాపుల రెంట్లు అడ్డగోలుగా పెరిగిపోయాయి. ఉపాధి కోసం ఏదైనా చిన్న బిజినెస్ స్టార్ట్ చేద్దాం అంటే రూ.10 వేలకు కూడా షట్టర్ దొరకని పరిస్థితి. అద్దే నెలకు రూ.10 వేల నుంచి 20 వేల వరకు ఉండగా, రూ.లక్షకు పైగా అడ్వాన్సు అడుగుతున్నారు. మార్వాడి వ్యాపారుల రాకతోనే ఇలా అడ్డగోలుగా షాపుల రెంట్లు పెరిగిపోయాయని, ఏదైనా షాపు ఖాళీగా ఉంటే మార్వాడీలు తమ వారిని రప్పించి ఎక్కువ రెంట్లు, అడ్వాన్సులు చెల్లించి షాపులు పెట్టిస్తున్నారు. మార్వాడీ వ్యాపారులు ఎక్కువ రెంట్లు, అడ్వాన్సుల ఆశ చూపుతుండటంతో ఇళ్ల యజమానులు అప్పటికే నడుస్తున్న షాపుల వారిపై ఒత్తిడి తెచ్చి ఖాళీ చేయిస్తున్నారని, లేదంటే మార్వాడీలు ఇస్తామంటున్న అద్దె అయినా ఇచ్చి ఉండాలంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ షాపు యజమానిని ఇలానే ఖాళీ చేయించారంటున్నారు.మున్సిపల్ కేంద్రానికి చెందిన ఓ ఎస్సి యువకునికి ఇటీవల ఎస్బీఐ మినీ బ్యాంకు మంజూరు కాగా ఆ యువకుడు ఆ సెంటర్ పెట్టుకోవడానికి సుమారు నెల రోజులు వెతికినా షట్టర్ లభించలేదు. ఓ షట్టర్ దొరికినా నెలకు రూ.12 వేల అద్దె, రూ.లక్ష అడ్వాన్స్ అడిగారని, తాను చేసిన కష్టమంతా రెంట్లకు, కరెంటు బిల్లులకే సరిపోతుందని ఆ యువకుడు ఆ సెంటర్ పెట్టడాన్ని విరమించుకున్నాడు. మార్వాడీల రాకతోనే షాపుల రెంట్లు ఇలా అడ్డగోలుగా పెరిగిపోయాయని, తన లాంటి వారు ఎలా ఉపాధి పొందగలుగుతారని ఆ యువకుడు ప్రశ్నించాడు. మార్వాడీలది చైన్ సిస్టం వ్యాపారం కావడం, వారికి ఆ సంఘాల నుంచి ఆర్థికంగా సపోర్టు ఉండటంతో స్థానిక వ్యాపారులకు వారి పోటీని తట్టుకుని నిలబడలేక ఆర్థికంగా చితికి పోతున్నారు. ఆంధ్రోళ్ల పెత్తనం సహించలేక ఉద్యోగ, ఉపాధి కోసం కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని, ఇప్పుడు స్థానికంగా మార్వాడీల పెత్తనం పెరిగిపోతుండటంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయన్న భావన యువకుల్లో ఏర్పడుతున్నది. మార్వాడీలను అడ్డుకోకుంటే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని యువకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.మున్సిపాలిటీ నుంచి అనుమతులివ్వొద్దు. మోత్కూర్ లో మార్వాడీ వ్యాపార కార్యకలాపాలు రోజురోజుకు పెరిగి పోతుండటంతో స్థానికులకు ఉపాధి లేకుండా పోతున్నది. స్థానిక మున్సిపల్ అధికారులు మార్వాడి వ్యాపారులకు అనుమతులు ఇవ్వకుండా వారిని నివారించాలి. స్థానికులు ఉపాధి కోసం బయటి ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని స్థానిక యువత వాళ్లలో వాళ్లే ఒక్కొక్కరికి వ్యాపారం పెట్టిస్తూ వారు బలోపేతమవడంతో పాటు స్థానికులకు ఏ రకంగా ఉపయోగపడని మార్వాడీ వ్యాపారులు. వాడు తెలుగు నేర్చుకోకపోగా వాడి భాషనే మనపై రుద్దుతున్న వైనం.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

**• ఆగస్టు 24న హనుమకొండ లో రాష్ట్ర బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ.. వామపక్ష ప్రజా పార్టీలు ప్రజా సంఘాలతో పోస్టర్ ఆవిష్కరణ... • సభను విజయవంతం చేయాలని... గూగులోత్ కిషన్ నాయక్ పిలుపు..**



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 19: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కమిటీ సారథ్యంలో ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని ఆదివాసులపై దౌర్జన్య కాండను తక్షణమే ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతూ ఈ నెల 24 న హనుమకొండ లోని అంటేడ్కర్ భవన్ నందు జరిగే రాష్ట్ర సభ ను విజయవంతం చేయాలని కోరుతూ మహబూబాబాద్ పట్టణం లోని డా.బి.ఆర్. అంటేడ్కర్ విగ్రహం ముందు పోస్టర్ ఆవిష్కరణ (గిరిజన సామాజిక చైతన్య వేదిక) ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కో కన్వీనర్ గూగులోత్ కిషన్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్ మాట్లాడుతూ తరతరాలుగా దట్టమైన అడవుల్లో అడవి తల్లి ని నమ్ముకొని జీవిస్తూ ప్రకృతి పర్యావరణం కాపాడుతూ ఈ సమాజానికి స్వేచ్ఛమైన గాలిని అందిస్తున్న ఆదివాసీ ములవాసులపై కేంద్ర ప్రభుత్వం మోడి, అమిత్ షాలు దండకారణ్యంలో ఉన్న 29 రకాల కనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి రాజ్యాంగ పరమైన ఆదివాసి చట్టాలను, హక్కులను 1/70 పిసా అటవీ హక్కుల పరిరక్షణ చట్టం, 5వ, 6వ షెడ్యూల్ చట్టాలను కాలరాసి అమాయకమైన ఆదివాసీలపై కేంద్ర బలగాలను, డిఆర్జేఐ లను 5వ షెడ్యూలు కాలరాసి వేల మంది బాలగాలను దింపి మూడు కిలోమీటర్లకు 5000 మంది సైన్యాన్ని దింపి మావోయిస్టుల అణిచివేత పేరు మీద వందలాది మంది ఆదివాసీలను వారి గ్రామాలపై దమన కాండ నిర్వహిస్తూ మహిళల పైన హత్యాచారాలు చేయడం విడ్డూరకరం అని అన్నారు. అలాగే మావోలతో శాంతి చర్చలు జరపాలని కాల్పుల విరమణ వెంటనే ఆపాలని కేంద్ర బలగాలను తక్షణమే వెనక్కి పంపించి ఆదివాసులను రక్షించాలని అని అన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కాలరాయవద్దని దేశ సంపదను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న చంద్రన్న, హలవత్ లింగన్న, దుద్దేల రామ్మూర్తి,కొత్తపల్లి రవి, మైస శ్రీనివాస్, గూగులోత్ హరి నాయక్, సామ పాపయ్య, అలకుంట్ల సాయిలు, బత్తుల పాపన్న, ఎనుగుతల ఉప్పలయ్య, చేపూరి గణేష్, వెంకుడోత్ ఉపేందర్, కేశ లింగన్న, మహమ్మద్ వాహిద్, మోష.తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోనీ రైతులకు యూరియా అందించడంలో పోలీసుల సహకారం

**ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టించవద్దు: మహబూబాబాద్ జిల్లా ఎస్పీ..**






తొలి అక్షరం/మహబూబాబాద్ వీరు ఆగస్టు 19: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంనీ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్ సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ గోదాములో నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. రైతులకు ఎరువులు సమయానికి అందేలా గోదాంల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం జరగకూడదని స్పష్టం చేశారు. గోదాంలలో నిల్వ ఉంచిన ఎరువులను కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే పంపిణీ చేయాలని అన్నారు.వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.యూరియా కోసం రైతులకు ఇబ్బంది పడకుండా చూడాలని, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని యూరియాను సకాలంలో అందించాలన్నారు.యూరియా స్టాక్‌ను ప్రభుత్వ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లతో పాటు ప్రైవేట్ డీలర్ల ద్వారా కూడా పంపిణీ చేయడం జరుగుతుందని అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు తమ అవసరం మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాల్సిందిగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.జిల్లాలో రైతులకు ఇబ్బంది కలగకుండా పోలీస్ యంత్రాంగం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆయన అన్నారు, వీలైతే టోకెన్ స్మార్ట్ ల ద్వారా అమ్మకాలు జరపాలని సూచించారు. పూర్తిస్థాయిలో యూరియా అమ్మకాలపై పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టిందన్నారు.అన్ని మండలాలకు యూరియా నిలువలు వచ్చేలా ప్రభుత్వం, అధికారయంత్రాంగం కృషి చేస్తుందని, ప్రతి మండలానికి యూరియా లోడ్ లు వస్తాయని, రైతులు కొంత సంయమనంతో వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, గూడూరు ఎస్ఐ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ లింగారెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మార్వో నాగ భవాని, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డి సి ఓ ఎన్వి రావు, ఏవో ఎండి అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతి వైభవంలో బోనం ఓ ప్రత్యేకం

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**కేశంపేటలో ఘనంగా చౌడమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు**

**ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్న వై. రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు**





తొలి అక్షరం/కేశంపేట, ఆగస్టు 19: తెలంగాణ సంస్కృతి వైభవంలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, బోనం రూపంలో అమ్మవారిని కొలవడం మన సంస్కృతి, సంప్రదాయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ అన్నారు. మంగళవారం కేశంపేట మండల కేంద్రంలో నిర్వహించిన చౌడమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మాట్లాడారు. ఆషాడం, శ్రావణ మాసాలలో గ్రామ దేవతలను పూజించడం, బోనం రూపేన అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించడం మన ప్రాంత ప్రజల సంస్కృతికి నిదర్శనమని, గ్రామదేవతలకు బోనాన్ని సమర్పించి, మొక్కులు తీర్చుకుంటే సకల శుభాలు కలుగుతాయని, పాడి పంటలు పుష్కలంగా పండుతాయని అన్నారు. అంటూ వ్యాధులు సైతం రాకుండా అమ్మవారు కాపాడుతారనే నమ్మకం మన ప్రాంత ప్రజల్లో ఉంటుందని, ప్రతి యేటా అన్ని గ్రామాలలో అంగరంగ వైభవంగా, భక్తి భావనతో బోనాల ఉత్సవాల నిర్వహించుకోవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, పీఎసీఎస్ చైర్మన్ జగదీష్, స్థానిక మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పర్వత్ రెడ్డి, మల్లేష్ యాదవ్, జమాల్, గోపాల్, మురళీ, శేఖర్, ప్రవీణ్ రెడ్డి, నరేష్ , రామకృష్ణ తదితరులు పాలొగొన్నారు.

# దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలి: షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

- షాద్ నగర్ ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష
- సమీక్షా సమావేశానికి హాజరైన అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి
- అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వాలని ఆదేశాలు
- రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 19:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గ వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం షాద్ నగర్ ఆర్డీవో కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశానికి రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డీవో ఎన్ఆర్ సరిత తదితర స్థానిక అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులను మరో 15 రోజుల్లో పూర్తిగా పరిష్కరించాలని ఏ ఒక్కటికూడా పెండింగ్ ఉండొద్దని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా రేషన్ కార్డుల విషయంలో అధికారులు మీనామేశాలు లెక్కించకుండా అవసరమైతే ఇతర పనులను పక్కనపెట్టి వెంటనే రేషన్ కార్డుల సర్వే ప్రక్రియతో పాటు అన్ని విషయాలను గ్రహించి వాటిని మూడు వారాల లోపల పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి వెంటనే కార్డులు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా గత రెవెన్యూ సదస్సులకు సంబంధించి షాద్ నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 3,105 దరఖాస్తులు వచ్చినట్లు సమీక్ష సమావేశాలు అధికారులు ఎమ్మెల్యే దృష్టి తెచ్చారు. ఇందులో 1,937 అప్రూవ్ అయ్యాయని మిగతా 1183 డిజెక్టేడ్ అయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికీ 548 దరఖాస్తులు పరిశీలించి పూర్తిచేసినట్టు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కొన్ని సాంకేతిక కారణాలవల్ల పూర్తయిన పనులు కూడా పెండింగ్లో ఉన్నట్లు భూభారతిలో కనిపిస్తున్నాయని ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యే తీసుకువచ్చారు. రంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు ఏవి ఉండకూడదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ అధికారులకు ఆదేశించారు. మిగతా పనులు ఏవైనా ఉంటే వాటిని పక్కన పెట్టాలని ముందుగా రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల కోసం చేపట్టిందని వాటిలో నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు ఎమ్మెల్యే కరాకండిగా సూచించారు. అదేవిధంగా రెవెన్యూ పరిపాలన పరమైన విషయాలను ఈ సమీక్ష సమావేశంలో అధికారులతో ఎమ్మెల్యే శంకర్ చర్చించారు. పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు.

# మహాదేవ్ పూర్ పాఠశాలకు ప్రహరీ గోడ మంజూరు చేయించండి

- యువ నాయకుడు భాగాళ్ల నరసింహ
- ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించిన బాగళ్ల నర్సింహా
- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 19:** విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించేలా చూడాలని గ్రామ యువ నాయకుడు బాగళ్ల నరసింహ్మ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కోరారు. మంగళవారం షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొందుర్గు మండలం మహాదేవ్ పూర్ గ్రామానికి చెందిన యువ నాయకుడు బాగళ్ల నరసింహ కలుసుకొని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడిలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించి ప్రహరీ గోడను నిర్మించేలా చూడాలని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విడతలో ప్రహరీ గోడల నిర్మాణాలను కచ్చితంగా చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం యువ నాయకుడు నరసింహ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి తన వంతుగా ప్రయత్నాలు చేస్తున్నానని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న పాఠశాలకు, అంగన్వాడికి ప్రహరీ గోడ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారనే సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేకు గ్రామస్తుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఆయన తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,ఫర్టిలైజర్ షాప్, పాఠశాలలను ఆకస్మిక తనిఖీ



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో ఆగస్టు 19:** మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్,డోర్నకల్ మండలంలో విస్తృతంగా పర్యటించారు,మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ పాఠశాల, ఫర్టిలైజర్ షాప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న పిల్లలకి నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ క్లాసుల ద్వారా తరగతుల నిర్వహించాలని, ప్రతి సబ్జెక్టు వారీగా పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యా బోధనలు అందించాలన్నారు, ప్రభుత్వం కల్పించిన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని, పాఠశాల పరిసరాలు డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ మరుగుదొడ్లు తదితర ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్రమం తప్పకుండా షెడ్యూలు ప్రకారం నిత్యం సానిటేషన్ నిర్వహించాలని ఆదేశించారు,భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ ఉండాలన్నారు,పిల్లల విద్యాసామర్థ్యాలను స్వయంగా కలెక్టర్ పరిశీలించారు, జిల్లాలో యూరియా కృత్రిమ కొరత సృష్టించద్దని, అధిక ధరలకు అమ్మ వద్దని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియాను అమ్మకాలు జరపాలని, రైతులకు అందుబాటు సమయాలలో సంబంధిత ఫర్టిలైజర్ షాపులను ప్రారంభించాలని, ఆన్లైన్ విధానం ద్వారా మాత్రమే రైతు యొక్క వివరాలు పాసుబుక్ ఆధార్ కార్డు ద్వారా అమ్మకాలు జరపాలని,దుకాణంలోని ఆన్లైన్ ఓపి ఎమ్మెస్, ఫిజికల్ గోడౌన్ నిలువలు కచ్చితంగా ఉండాలన్నారు, స్వయంగా రిజిస్టర్ లను పరిశీలించి ఖచ్చితమైన సమాచారం రైతులకు చేరవేయాలని ఆరోజు స్టాక్ వివరాలు రావలసిన స్టాక్ వివరాలు అన్ని రైతులకు విషయ సూచిక ద్వారా తెలియజేయాలన్నా, నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రస్తుతం రైతులు వేసుకున్న పంటలకు అనుగుణంగా ఫర్టిలైజర్స్ మందుల వినియోగం పూర్తిగా తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, వానాకాలం సీజన్ లో విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, అవసరం ఉన్నచోట వైద్య శిబిరాలు నిర్వహించాలని, నిత్యం ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు,మందుల స్టాక్ వివరాలు సిబ్బంది హాజరు వివరాలు ఆయన పరిశీలించారు, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, సీజన్కు అనుగుణంగా వైద్య కార్యాచరణ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత సిబ్బందిని ఆదేశించారు,జిల్లాలోని ప్రత్యేక అధికారులందరూ వారికి కేటాయించిన మండలాలలో వర్షాకాలం వరదల కారణంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకొని సిద్ధంగా ఉండాలని, ప్రతి ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ నిర్వహించి,యూరియా నిలువలను సరిచూసుకోవాలన్నారు, వసతి గృహాలు, పాఠశాలలు క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు,ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, డోర్నకల్ తహసిల్దార్ ఇమ్మానియేల్, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వాల పాలనలో రైతుల అధోగతి..?

**వరుణ దేవుడు కరుణించిన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కరుణించడం లేదు...**

**అందె మహేశ్వర్ ( మాజీ ఎంపీటీసీ తనయుడు)బిఆర్ఎస్ యువ నాయకులు**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 19:** సకాలంలో యూరియా అంధకా అనేక ఇబ్బందులు పడుతున్న తెలంగాణ రైతులు ముఖ్యంగా షాద్నగర్ నియోజకవర్గంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది, రైతులు అనేక విధాలుగా బాధపడుతున్నారు, యూరియా కోసం దుకాణాల ముందు ముందు చెప్పుల వరుసలతో తడుస్తూ ముద్దవుతున్న రైతులు, ఇకనైనా మేల్కొని యూరియా అందించగలరని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము కావున రైతులు పడుతున్న బాధను అర్థం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం యూరియా సకాలంలో అందించగలుగుతారని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాము, లేకపోతే రైతుల ఆగ్రహానికి, గురవుతారని, కెసిఆర్ పాలనలో రైతులకు సకాలంలో అందించిన యూరియా ఈరోజు వీరి పాలనలో అనేక ఇబ్బందులు పడుతున్న రైతులు, పాలనలో ఎవరున్నా రైతులు మాత్రం ఇబ్బంది పడకుండా చేయండి.

# భూఖ్యా తండాలో గంజాయి కలకలం



**తొలి అక్షరం/మరిపెడ ఆగస్టు 19:** మరిపెడ మండలం ఉల్లేపల్లి పరిధిలోని భూక్యతండ గ్రామపంచాయతీ నందు నివాసం ఉంటున్నటువంటి భూక్య బిఖ్య అనే వ్యక్తి ఇంట్లో నిషేధిత గంజాయి ఉన్నది ఆయన గంజాయి సరఫరా చేస్తున్నాడు అనే విషయాన్ని గ్రామానికి సంబంధించిన ఇన్ఫార్మర్ల ద్వారా తెలుసుకున్న స్థానిక మరిపెడ పోలీస్ స్టేషన్ ఎస్సై బోలగాని సతీష్ గౌడ్ వెంటనే స్థానిక పోలీస్ సిబ్బంది కి ఆదేశాలు జారీ చేశారు సందర్భంగా పోలీసు సిబ్బంది మరొక ఎస్సై గ్రామానికి చేరుకొని భూక్య బిఖ్య ఇంట్లో సోదాలు నిర్వహించగా 500 గ్రాముల గంజాయి దొరికినట్టు పోలీసులు సమాచారం ఇచ్చారు వెంటనే వారు ఆ గంజాయి నీ స్వాధీన పరుచుకొని ప్రజలకు హాని కలిగిస్తున్నటువంటి ఇలాంటి మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం అన్నారు

# జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

- ఆవిష్కరించిన రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా తెలంగాణ రాష్ట్రం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించబోతుంది




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 19:** దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా తెలంగాణ రాష్ట్రం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించబోతుందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి అన్నారు. ఈరోజు మినిస్టర్స్ క్వార్టర్స్ లోని తన నివాసంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు తొమ్మిది రోజుల పాటు ఉత్సాహభరితంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించబోతున్నామని ఆయన అన్నారు. ఆగష్టు 23వ తేదీ నుండి 31వ తేదీ వరకు హైదరాబాద్ నగరం లోని స్పోర్ట్స్ అథారిటీ క్రీడా ప్రాంగణాలతో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ క్రీడా కార్యక్రమాలకు రూపకల్పన చేశామని మంత్రి తెలిపారు. ఈ ఉత్సవాలలో ఏడాది వయసున్న పిల్లలనుంచి 70 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్స్ వరకు పాల్గొనే విధంగా రోజుకొక కార్యక్రమం చొప్పున రూపకల్పన చేశామని మంత్రి తెలిపారు. క్రీడల పట్ల అవగాహన, ఆలోచన, ఆచరణ అన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు యావత్ క్రీడా కుటుంబ సభ్యులు మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. నూతన క్రీడా విధానం 2025 అమలులో భాగంగా జాతీయ క్రీడా దినోత్సవాలకు రూపకల్పన జరిగిందని మంత్రి వివరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ఖేలో ఇండియా అధికారి డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ ఔదార్యం

- యాగశాల నిర్మాణానికి 2.50,000 విరాళం



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 19:** పెద్ద జానమ్మపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న మహా కుంభ సంప్రోక్షణ, పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో హోమం నిత్య పూజలతో పాటు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. నందిగామ మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ యాగశాల నిర్మాణానికి 2.50,000 విరాళం ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఆయన వెంట నందిగామ మాజీ ఎంపిటిసి కొమ్ము కృష్ణ,కుమారస్వామి గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జంగా నరసింహులు, రవీందర్ గౌడ్ పట్టణ ప్రముఖులు సాయి ఈశ్వర్ రెడ్డి, పలబట్ల బలరాజ్,కానుగు రాం భూపాల్,గుండాల సలయ్య తదితరులు పాల్గొన్నారు.



# మైసమ్మా.. కాపాడమ్మా

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ఘనంగా కేశంపేట చర్ల మైసమ్మ బోనాలు**

**బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే అదిరిపోయే స్టెప్పులు**

**తొలి అక్షరం/కేశంపేట, ఆగస్టు 19:** మైసమ్మ తల్లి మమ్మల్ని కాపాడు తల్లి అంటూ చర్ల మైసమ్మకు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మొక్కుకున్నారు. కేశంపేట గ్రామంలో చర్ల మైసమ్మ తల్లి బోనాల సందర్భంగా ఆ తల్లిని దర్శించుకొని ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం కేశంపేట మండల కేంద్రంలో జరిగిన బోనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న అనంతరం బోనాల వేడుకల సందర్భంగా డప్పు వైద్యాల మధ్య పోతురాజుల సందడితో ఎమ్మెల్యే భక్తుల కోరిక మేరకు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..అమ్మవారి ఆశీస్సులతో నియోజక వర్గంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడం జరిగింది.అనంతరం పోతురాజులతో కలిసి చిందులు వేస్తూ నృత్యం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు గూడవిరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి ,అందె మోహన్ ముదిరాజ్, గిరి యాదవ్, అనసూయ నర్సింలు, పర్వతాలు, రూప్ల నాయక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

